# భూమికోసం

దేశమంతా తెల్లదొరలకు ఎదురుతిరుగుతున్న రోజులు. తెలంగాణాలో నిజాము తన పాలనను సుస్థిరం చేసుకోవాలని చూస్తూ, ఎక్కడ ఏతిరుగుబాటు తలెత్తకుండా సభలు, సమావేశాలు జరగకుండా హుకుం జారీ చేశారు. ఆహుకుంను ఆయన పోలీసు బలగంతో పాటు వాళ్లకు మద్దతుగా రజాకార్లు జనాన్ని అణచివేస్తూ

అరాచకాలు సృష్టిస్తువున్నారు. ఆస్తులను దోచడం, ఆడవాళ్లను చెరచడం 'ఎందుకు' అని ప్రశ్నించిన, ఎదురు తిరిగినా అక్కడికక్కడే తుపాకితో కాల్చి చంపడం, ఇండ్ల కునిప్పు పెట్టి భయ భ్రాంతులను చేస్తూ వున్నారు.

జనం భయపడి పోకుండా పోరాటంలో నిలబడి ధైర్యాన్ని నూరిపోస్తూ ఇల్లిల్లు, వాడవాడ తిరుగుతూ అటు నిజాం పోలీసులనుండి ఇటు రజాకార్లనుండి తప్పించుకుంటూ దినమంతా పనిపాటల్లో ఉంటూ రాత్రిపూట ఊళ్ళు తిరుగుతుండే వాళ్ళు సంఘపోళ్ళు.

రాంపల్లి చుట్టుపట్టు ప్రాంతంలో రజాకార్ల పోరు ఎక్కువకాగా ఆప్రాంతంలోని జనానికి ధైర్యాన్నిస్తూ, పోరాటపు బాటలో నడిపించేటందుకు కార్యోన్ములను చేస్తున్న ఓ యువకున్ని నేను చూసాను. ఆయన పేరు ఎంకులు. నల్లని శరీరఛాయ తెల్లని పలువరుస ముఖంలో నవ్వుల పొరలు. కళ్లలో కాంతి అలలు. భుజాన గోనెసంచి, చేతిలో దినపత్రిక, నిమ్మకాయలు అమ్ముతూ ఊరూర తిరిగేవాడు. ఆరోజుల్లో నిమ్మకాయలు, కోడిగుడ్లు ఇప్పుడు దొరికినట్లుగా దొరకకపోయేది. ఏక్కడోగాని బావుల దగ్గర నిమ్మ చెట్లుండేవి. అక్కడక్కడ నిమ్మ, నారింజ కలిపిన తోటలుండేవి. అవి జాగీరుదారులకు, భూస్వాములకు సంబంధించినయి వుండేది.

ఎంకులు అలాంటి తోటల దగ్గర నిమ్మకాయలను కొని బస్తాలో నింపుకొని భుజాన వేసుకుని ఊళ్ళన్ని అమ్ముతుండేవాడు. ఆరోజుల్లో రెండు పైసలకో గుడ్డు, పైసకు రెండు నిమ్మకాయలు అమ్మేది. మంత్రతంత్రాలకు, వైద్యానికి నిమ్మకాయలను వాడేవారు.

ఆరాత్రి మరీ చీకటి రాత్రి.

పరిగెత్తే రైలు చక్రాలకు పట్టాలు తెలిసినట్లుగా నడిచే పాదాలకు తెలుసు పల్లెల్లోని పిల్ల బాటలు. చెప్పుల చప్పుడుకు పాములు పక్కకు పోతాయి. పక్షుల చప్పుల్లు ఊరు దూరాన్ని తెలుపుతాయి. పిల్లులు ఎదురై, కుక్కలు మొరిగి గూడెపు బాటలను తెలుపుతాయి. ఆ ఆనవాళ్లను గమనిస్తూ అంత చీకట్లో ఓ పిల్ల బాటన నడుస్తున్నాడు ఎంకులు. నడకలో అలుపెరుగని వేగం వున్నది. స్థావరం చేరాలన్న పట్టుదల వున్నది. భుజాన గోనెసంచి, చేతిలో కర్ర, వడివడిగా నడక. ఇప్పటి గద్దర్‌లాగా ఆరోజుల్లోనే అర్ధనగ్నపు కట్టు, గొంగళి బదులు గోనె సంచి, చీకట్లో కలిసిపోయే రంగు.

దీపాలు పెట్టేవేళ్ళ. ఎంకులు చండూరునుండి బయలుదేరి మునుగోడు మీదుగ పలివెలకు చేరాలి. పలివెలలో ఊరిబయట తనకోసం ఎదురు చూస్తున్న కామ్రేడ్‌ను కలవాలి. అందుకే పరుగులాంటి నడక. రాంపల్లి మఖ్బూల్ ముఠా రజాకారులు, పాశం పుల్లారెడ్డి అనుచరుల నిఘా ఆప్రాంతంలో ఎక్కువ, వాళ్ల కంట పడకుండా గమ్యం చేరాలి. బాట ప్రక్కమ్మటేవున్న పొలాల్లొ కప్పలు చప్పుడు చేస్తువున్నాయి. రాత్రి యింత తిని బావుల దగ్గర మోటలు తోలడానికి వస్తున్న రైతు కూలీలు కష్ట సుఖాలు, అప్పుల బాధలు మాట్లాడుకుంటు వస్తూ వాళ్లశాళ్ల బావులు రాగానే వాటివైపు వెళుతువున్నారు.

ఎంకులు నడుస్తునే ఉన్నాడు.

చర్రమంటు ఓ పాము కుడినుండి ఎడమకు పోయింది. కాస్సేపే ఆగి మళ్ళీ నడక సాగించాడు.

దసరా రోజులు బాగా పండిన సజ్జ మొదలగు పంట చేలపై నుండి

వస్తున్నగాలి ఏదో కొత్త శక్తిని యిస్తుంది. బాట పక్కమ్మటి వున్న చేలోని మంచె మీద నిప్పురవ్వ మెరిసింది. చుట్టూ చూస్తూ నడుస్తున్న ఎంకులు అది చూసి ఆగి తన నడికట్టులోని జెకముకితో నిప్పురవ్వలను వెలిగించడం, మంచె మీద మళ్ళీ అదే చమక్, ఈసారి రెండు సార్లు మెరిసింది.

ఎంకులు రెండుసార్లు చమక్ మనిపించాడు.

మంచెమీది మనిషి మంచెదిగి, ఎంకులుకు ఎదురొచ్చి ఎంకులు భజం మీద గోనెసంచి తన భుజం మీద వేసుకుని, చేలోని మంచెవైపు నడిచాడు. వెనుకాల ఎంకులు. ఇద్దరు మౌనంగా నడిచారు. మంచె పక్కమ్మటేవున్న బండ మీద కూర్చున్నారు.

''ఎక్కడనుండి రాక'' అడాగాడు రాములు. రాములు ఆ ఊరి రైతు. సంఘంలో చురుకైన కార్యకర్త.

''చండూరు''

''కాసిన్ని నీళ్ళు తాగు'' అంటు మంచె గుంజకున్న నీళ్ల తిత్తిని తెచ్చి యిచ్చాడు రాములు.

ఎంకులు తిత్తిని పైకెత్తి పట్టి చల్లని నీళ్లను తాగుతువున్నాడు.

''ఇక ఆపు, కడుపునిండా నీళ్ళే తాగితే ఎట్లా, గంజి బువ్వ వుంది'' అంటూ మంచె మీదికి ఎక్కి గంజి బుడ్డిని తెచ్చి ముందు పెట్టాడు.

''నీవు తిన్నావా'' ఎంకులు అడాగాడు.

''నేను తినే నీకు తెచ్చిన'' అంటూ బుడ్డికి కట్టిన గుడ్డను యిప్పి దాని కొసన వున్న ముడిని విప్పి అందులోని ఉల్లిగడ్డను, పచ్చి మిరపకాయలను ఎంకులుకు ఇచ్చాడు రాములు.

ఎంకులు చేతులు కడుకొని రొండిన వున్న మర్రాకును

ఎడమచేతిలో పట్టుకొని తింటూ మధ్య మధ్య ఉల్లిగడ్డను, పచ్చిమిరపకాయలను కొరుక్కొని తింటువున్నాడు. ఆఖర్న వున్న గంజిని పూర్తిగా తాగి పక్కన పెట్టి చేతులు కడుక్కుంటూ-

''నిన్న చండూరుకు పట్నం నుండి కవులు వచ్చింద్రు. పొద్దంతా మీటింగు పెట్టింద్రు. నల్లగొండనుంచి నలుగురు వచ్చింద్రు. ఏం జరుగుతుంది. మనం ఎటువైపు, పోరాటాన్ని ఎట్లా ఉధృతం చేయిలె. విషయాల మీద మాట్లాడింద్రు. లేవిగల్ల కట్టొద్దట, గ్రామకమిటీలు వేసి రజాకార్లను తిప్పి కొట్టాలె. పెద్ద పెద్ద ఊర్లల్ల గ్రంధాలయాలు పెట్టి జనంచేత పుస్తకాలను, పత్రికలను చదివించాలె.

అంతేకాదు ఇదిగో 'వెట్టి చాకిరి' పై కరపత్రాన్ని ఆంధ్ర జనసంఘం వారు విడుదల చేశారు. ఈ కరపత్రం అందర్కి అందవల్సి వుంది. గ్రంధాలయ స్థాపన పేరట సాహిత్య సమేవేశాలను జరపాలని, భావచైతన్యాన్ని బాగవ్యాప్తి కలిగించాలని చండూరు సమావేశ నిర్ణయాలు''

''ఎంకులు నీవు ఎంతవరకు చదువుకున్నావు'' మంచి తెలుగును మాట్లాడడం విన్నాక అడాగాడు.

''ఏం చదువు ఎండకాలం చదువు. సాతాని పంతులు పెద్ద బాలశిక్ష వరకు చెప్పాడు. ఆ తరువాత ఉద్యమమే మాట్లాడనేర్పింది''.

''నీవు ఎక్కడా సమావేశంలో మాట్లాడవుగదా''

''వింటాను కదా'' అన్నప్పుడు తృప్తిగా చూశాడు రాములు. రాములు పెద్ద బాలశిక్ష వరకు చదివాడు

''వర్తక సంఘాలు కూడ నిజాం తాబేదార్లకు, పెత్తందార్లకు

యికనుండి ఏలాంటి సరుకులు యివ్వటం సహాయం చెయ్యడం వుండదన్నారు.

''అందరిలో ఆలోచన పెరిగింది. పోరాటానికి సిద్ధమైతున్నారు.

''కావల్సింది అదే కదా'' అప్పుడే వాళ్లముందునుండి ఓ పాము పరుగెత్తగా దాని వెనకాల ఓ ముంగిస.

''వీటి వైరం వీటిదే'' అని రాములు వైపు మళ్ళి-

''ఇగ నేను వెళ్ళిపోతాను. నీవు రేపు ఆలేరు వెళ్ళి ఈ కరపత్రాలను యిచ్చిరా'' అన్నాడు.

''సరే'' అంటూ ఒకరి చేతిలో ఒకరిచేయి వుంచుకొని కాసేపు ఒకరి కళ్ళను ఒకరు చూసుకున్నారు.

''మధ్యరాతిరి అయింది కాసేపు కునుకు తీసి వెడితే''

''వద్దు ఏ వూరికి పోతే ఆ వూళ్ళో పడుకోవద్దని దళ నాయకుని నిబంధనలు. జనం మనల ఏమంటున్నారు? చీకటోళ్ళు అని, మన ప్రయాణం చీకట్లోనే'' అంటూ అక్కడనుండి కదిలాడు ఎంకులు.

••••

రజాకర్లు ఊరిమీద పడి దొర్కినోళ్ళను కొట్టారు. తన్నారు. నానా గందరగోళం చేశారు. ''ఎంకులు ఎక్కడ అని'' ఎంకులు భార్యను జుట్టుబట్టి బజార్లోకి గుంజి ''నీమొగుడేడే'' అని తిట్టారు. ఆమె తనకేమీ తెలియదని, పట్నంలో రిక్షాతొక్కడాన్కి పోయిండని చెప్పినా వినలేదు.

''నహీ, వాడు పట్నం పోలేదు. ఆడు ఇక్కన్నే ఎక్కన్నోవుండి మారాక పోకల సంగతి బైటపెడుతుండు. ఆ బద్మాష్‌ని పట్టుకోవాలె అంతే'' అన్నాడు. రజాకార్ల సంకలో వున్న ఓ పోలీసు పటేలు.

''నిజంగా నాకు తెల్వదు దొర'' అంది ఎంకులు భార్య. అప్పుడు ఆ నడిబజార్లో ఆ దుర్మార్గుల మధ్యన తోడేళ్ళ మధ్య జింక లాగ బిక్కుబిక్కుమంటూ నిల్చుంది. వాళ్ళు ఎంకులును నానా తిట్లు తిడుతుంటే ఆమె విలవిల్లాడి పోతూవుంది

విడిపడిన గొప్పు, ఏకధారగ కన్నీరు, భయంతో ఎగసిపడుతూ, జోడించి వుంచినా వనుకుతున్న చేతులు. మణికట్టునుండి మోచేతివైపు, జారివున్న మట్టిగాజులు.

''ఏసాలి నహి బోల్తి, జోపిడి జలావో'' అన్నాడు రజాకార్ల నాయకుడు.

తాటాకుల గుడిసెమీద మండుతున్న కొక్కాసు పడగానె మంటలు లేచాయి. ఎంకులు భార్య నోరు తెరిచినా ధ్వని రాక అలా నిలుచుండిపోయింది. గుడిసె తగలబడుతునేవుంది.

గుడిసెలో గటక కాస్తున్న ఎంకులు అరవై ఏండ్ల తల్లి భయంతో బయటికి పరిగెత్తుకొస్తూ గడపలోనే కూలబడిపోయింది. ఎంకులు భార్య పరిగెత్తి తన అత్తను తన భుజాన ఎత్తుకుని బయటికి తెచ్చింది. అప్పటికే ముసలామె మీద కొన్ని కాలుతున్న తాటికమ్మలు, కట్టెపుల్లలు పడ్డాయి. అత్త భుజాలకింద చేతులేసి ఎత్తుకొని కోడలు కాలే గుడిసెకు దూరంగా తీసుకెళ్లి కూర్చోపెట్టుకుని వల్లంత తడిమి చూసింది. అప్పటికే గుడిసె పూర్తిగా అంటుకుంది. ఊరి జనం నీళ్లతో రాగ-

''కోహి పాని డాలతో'' అన్నాడు

ఎక్కడోళ్ళు అక్కడ నిలబడి పోయారు.

మంటకుగాలి తోడైంది. పక్క గుడిసెలకు మంటలంటు కున్నాయి. అది చూడలేని జనం నీళ్లకుండలతో నీళ్లను చల్లబోయారు.

గాలిలో తుపాకి పేలింది!

అంతే జనం బొమ్మల్లా నిలబడి పోయారు.

గుడిసెలు కాలుతూనే వున్నాయి.

''దేకో, ఎంకులును పట్టియ్యకపోతె ఊరంతా యిట్లనే'' జనం చేసేదిలేక నెత్తి నోరు కొట్టుకుంటు ఏడుస్తున్నారు.

''ఎంకులు వస్తే రాంపల్లి తీసుకురండ్రి. ఇనాం యిస్తాం'' అంటూ వెళ్ళిపోయారు.

కాలికూలిన గుడిసెలమీద నీళ్ళు చల్లుకున్నారు. కూలిగింజలు కాలి పేలాలైనాయి. బట్టగుడ్డలు బూడిద అయినాయి. దొంతులు పగిలిపోయి వాటిల్లో దాచుకున్న కందులు, వులవలు బొగ్గు అయినయి. గంపకింద పొదుగుతున్న కోడిపెట్టలు, గుడ్లు మాడిపోయినయి. వాటిని చూసుకుంటూ, ఏడ్చుకుంటూ ఎంకులును తిట్టని వాళ్ళు లేనేనేరు. తల్లిని పట్టుకొని ''నీ కొడుకు పుణ్యమా అని ఊరు తగలబడ్డది'' అని అన్నారు.

భార్యను నిలదీస్తు ''నీ మొగన్ని ఎక్కడ తోలినవు, తీసుకొచ్చి పట్టియి. లేకపోతే మీ అందర్కి సావు తప్పదు'' అన్నారు.

మొత్తం మీద ఊరంతా ఉడికిపోయింది.

ఎంకులు ఎక్కడున్నడో ఎవరికీ తెలియదు.

••••

వెలిమినేడుకు సిరిపురం మధ్య రెండు గుట్టలు గుబురైన పొదలతో చిక్కని సీతాఫలాల చెట్లతో పచ్చగా ఉన్నాయి. మిలట్రీ ట్రక్స్‌ను గుట్టల మధ్యన వున్న వొంపులో ఆపుకొని, చెట్లచాటున వుండి వచ్చిపోయె పిల్లబాటల మీద కన్నేసి చూస్తువున్నరు. అప్పటివరకు

గుట్టల్లో వున్న ఎంకులు గుట్టమీదనుండి ఏదో ఊరివైపు రావచ్చు అని తెలిసింది. ఎంకులును పట్టుకుంటె కమ్యూనిస్టు దళాల స్థావరాలు తెలుస్తాయని రజాకార్లు, పటేలు, పట్వారీల ద్వార మిలిట్రీ వాళ్లకు చెప్పించారు. అది నమ్మిన మిలట్రీవాళ్లు ఆ రోజు అక్కడ మాటువేసిఉన్నారు.

ఊళ్ళోనుండి పశువులు, గొర్రెలు, మేకలు అడవికి వస్తున్నాయి. వాటికాపర్లు వాటివెనుకాల నడుస్తువున్నారు. అప్పుడే గుట్టల్లోనుండి ఎండుకట్టెల మోపును నెత్తిమీద పెట్టుకొని ఊళ్ళోకి వస్తున్న వ్యక్తి కనిపించాడు. మిలట్రీ గన్నులను సవరించుకుంటూ చెట్ల చాటుగా వంపులోకి దిగుతూ అతనినే కనిపెడుతువున్నారు. నెత్తి మీద కట్టెల మోపు, కట్టెలు నెత్తికి వత్తుకపోకుండా తలమీద రేలాకులు పెట్టుకున్నాడు. ఓచినిగిన అంగి, మొలన మామూలు దొడ్డు పాత పంచె. అతను ఎటు చూడకుండా తన పిల్లబాటనే చూసుకుంటూ ఊరివైపు నడుస్తువున్నాడు.

''రుక్‌జా'' అన్నాడు ఓ సిపాయి పొదలోనుండి బయటికి వస్తూ. ఆ కట్టెలుతెస్తున్న వ్యక్తి ఆగలేదు. నడుస్తూనె వున్నాడు.

''లక్కిడినిచేగిరావో''

అతను నడుస్తూనే వున్నాడు.

''గిరావొరే'' అంటూ సిపాయి తుపాకి మడమతో రొండి మీద గుద్దాడు ఎదురొచ్చి నిలుచోని.

అతను కట్టెలు నేల మీదేసి నిలుచున్నాడు.

''క్యానామ్'' అడిగాడు సిపాయి

అతను నోరు విప్పలేదు. బెదిరి బెదిరి చూస్తువున్నాడు.

''నామ్ బోలో, కాంసె ఆరాహై''

అతను మాట్లాడలేదు

సిపాయి కట్టెల మోపులోనుండి ఒకర్రను తీసుకుని అతన్ని కొట్టాడు. చప్పుడు లేదు. దెబ్బ వంటి మీద పడకుండా చేతులతో అడ్డుకుంటూ కర్ర వచ్చే వైపు, కొట్టె వ్యక్తిని దీనంగా చూస్తువున్నాడు కాని నోరు విప్పలేదు.

సిపాయి కొట్టి కొట్టి అలసిపోయాడు. అది చూచి మిగిలిన సిపాయిలు, వాళ్ల కామాండర్ దగ్గరకొచ్చి-

''చోడో వుస్సే''

కొట్టడం అపాడు.

''అస్సల్ వునే బాత్‌కర్‌సక్త''

''ఏం నీది ఏంపేరు వున్నది'' అని అడిగాడు కామాండర్.

అతను నోరు విప్పలేదు

''ధన్'' మని తుపాకి పేల్చాడు.

అతను కదలలేదు. తుపాకి తన వెనక పేలినా అటువైపు కూడ చూడలేదు.

జేబులోని చాకు తీసి అతని రెక్కను చీల్చాడు. రక్తం చిర్రున చిల్లింది. మరోచేత్తో వాడిసే రక్తాన్ని తాకి చూస్తున్నాడే తప్ప అమ్మ-అయ్య ఏమి అనలేదు.

''చోడ్‌దే యిసే'' అంటూ వాన్నే చూస్తూ ''ఏగూంగా అహే, బయిరఅహే'' అని మళ్ళీ పొదల్లోకి వెళ్ళి పోయారు.

అతను అక్కడినుండి కదిలి ప్రక్కన్నె వున్న చెట్టు ఆకులను తెంపి, నలచి గాయం మీద పసరు పూసి చుట్టూ చూశాడు. ఎవరూ

కనిపించలేదు. కొంత దూరం నడిచి పొలంలో నీళ్ళు మలుపుతూ బావి సొంతదారు కనిపించాడు. దగ్గర్కి రమ్మని సైగ చేశాడు. మెదువులను సరి జేసి వచ్చాడు.

''ఆ పసరేంది అన్న''

''తర్వాత చెపుతగాని చుట్టుపట్టు మిలట్రోళ్ళు తిరుగుతున్నారు''

''అదే నేను చూస్తున్నా వాళ్ళు అటు పోవడం సూసిన్న''

అవును అన్నట్లు తలాడించాడు

''నేను అదే ఆలోచిస్తున్న అంటున్నపుడే జీప్ చప్పుడైంది అది విని అన్న చొప్పము కింద దాక్కున్నాడు. జీపు బావి గడ్డ పక్కన ఆపి, గుడిసె దగ్గర్కి వచ్చి ''ఏయ్ ఎంకులు ఆయా'' అని అడిగాడు.

''ఎవరు రాలేదు దొర, ఏ ఎంకులు దొర'' అని అడిగాడు.

''ఎంకులు తెలియదురభే అదే నిమ్మకాయల ఎంకులుర. వాడు దొరుకుతలేడు''

'' నాకైతే తెలువదు దొర'' అంటూ చేతులు జోడించాడు.

''తెలుసుకోలి భే'' అంటు తుపాకి మడిమతో భజం మీద కొట్టి చొప్పము వైపు వెళ్లి చుట్టు చూశాడు. అప్పుడే ఓపాము చోప్పము కింది నుండి బయటకి వస్తూ మిలట్రి సిపాయిని చూసి పడగెత్తి చూసింది. అది చూసిన సిపాయి

'' సాంపురే, నాగ్‌సాంపు'' అంటు జీప్ వైపు పరిగెత్తి జీపులో కూర్చున్న ఓగిరింపు తగ్గలేదు, వణుకుడు తగ్గలేదు.

జీప్ స్టార్ట్ అయి ఊరివైపు వెళ్లిపోయింది.

చొప్పముకింది నుండి లేచి వచ్చిన అన్న జీప్ పోయినవైపు చూస్తూ వున్నాడు.

''నీవు తావు మార్చాలన్నా'' బావి ఆసామి అన్నాడు.

''అదే నేనూ చూస్తున్నా'' అని ఆలోచించి ''సరే ఓగడ్డి మోపైతే యివ్వు'' అని గడ్డిమోపును నెత్తిన పెట్టుకుని ఊరిబాటన నడిచాడు. గడ్డి మోపు భుజాల వరకు వేలాడుతువుంది.

గొడ్డు గోద ఊరు చేరేవేళ్ళ నీడలాగా చీకటి పరుచు కుంటుంది. నెత్తిన గడ్డి మోపుతో ఊరి దగ్గరికి చేరిన అన్నకు ఎవరింటికి వెళ్ళాలో తట్టలేదు. ఊరెమ్మటి ఉన్న బంధంలో నిలుచుని ఆలోచిస్తు వున్నాడు.

పక్కమ్మటే వున్న కలెమందల పొదల చాటున ఏదో పెనుగులాట! గాజుల చప్పుడు. ఏడుపుతో గూడిన బలహీనపు బతిమిలాడుతున్న స్త్రీ గొంతు.

ఆ మాటలను ఏరిపార విని గడ్డిమోపు కిందేసి పెనుగులాడుతున్న వైపు పిల్లిలాగ వెళ్ళి పులిలాగ వాని పైన బడ్డాడు.

ఆమె తప్పుకొని పరిగెత్తింది.

వాడు పక్కనే వున్న రైఫిల్ అందుకోబోయాడు. వానికంటె ముందు అన్న తుపాకి అందుకుని వానికి గురిపెట్టి ''పరాయి స్త్రీతో ఆపని ఎందుకు చేస్తున్నావు'' అని గద్దించాడు.

''ఏయ్ రైఫల్ దేవో'' అన్నాడు బెదిరించినట్టు మిలటరీ సిపాయి.

''నీవు చేసిన పని ఏమిటి'' రైఫిల్‌ను ఎదమీదుంచి

''ఆరె ఓతో చెల్‌తె రహెతా'' అన్నాడు దులిపేసినట్టు.

''అచ్ఛా ఏది'' అని ట్రిగ్గర్ నొక్కాడు.

''ధన్, ధన్'' రెండు సార్లు గుండ్లు గుండెల్లోంచి దూసకపోయి రక్తం చివ్వున చిమ్మింది. కాసేపు కదిలి శ్వాస వదిలాడు. పక్కన్నే చెరువు కట్టున వంట చేసుకుంటున్న మిలటరీ వాళ్లు వొకరితర్వాతొకరు

''క్యా హువా'' అంటు వస్తు వుంటె, గాదంగి పొదల చాటున వున్న అన్న చేతిలోని రైఫిల్ నిప్పులు కక్కుతునే వుంది. ఒక్కొక్కరు నేల వొరుగుతునే వున్నరు.

''రైఫిల్ నీచే దాల్‌దేవో, నహితో అభి గోలి చెలాయేగా'' అన్నాడు పక్కన్నే వున్న సిపాయి.

అన్న జీపువైపు చూస్తువున్నాడు. అతని చేతిలోని రైఫిల్ అటే చూస్తు వుంది.

హటాత్తుగా ఓబలమైన చేయి అన్న భుజం మీద పడి, తుపాకిని నేల పడేట్టు చేసి, అతనిమీద కూర్చుని నేలను కరచుకునేటట్టు అనగబట్టాడు కమాండర్. రెప్పపాటులో అన్న కమాండర్ చేతిలో చిక్కాడు, బూటు కాలితో తొక్కిపట్టి తుపాకి మడిమెతో పొడిచాడు. పక్కటెముకలు విరుగుతున్న 'పటపట' చప్పుడు.

రెక్కపట్టి విరిచి, భుజం కిందగాయాన్ని చూసి ఉదయం తాను మూగవాన్ని చాకుతో చేసిన గాయం గుర్తు రాగేనే 'వాడే వీడా' అని విస్తు పోయాడు. అబ్బా ఎంత యిదిగా నటించాడె అనుకుంటూ, నడుం మీద తన్నాడు.

''అచ్చా భేటా - జెప్పురా, నిమ్మకాయల ఎంకులువుర'' అన్నాడు వెలికల తిప్పి మూతిని పిసికాడు.

ఆ దెబ్బలకు కళ్ళను మూసి తెరుస్తు-

''ఛీ, కమాండర్‌వై చాటు దెబ్బకొడుతావుర పిరికివాడ, ఎదురుగ వస్తే నీ పని చెప్పేవాన్ని'' అంటూ లేచి కూర్చునే ప్రయత్నం చేశాడు.

''అచ్చా, జబ్ బాత్ నహీకరె కేం'' అంటూ ముఖం మీదగుద్దాడు.

''అమ్మా'' అంటూ వెలికల పడిపోయాడు.

ఈ లోపు జీపు డ్రైవర్, పరిగెత్తుకొచ్చి రైఫిల్స్‌ను అందుకున్నాడు. కమాండర్ అన్న భుజాలకింద చేతులు వేసి జీపు దగ్గర్కి ఈడుచుకుపోయి, తాడుతో కాళ్ళు చేతులు కట్టి, జీపు బానెట్‌కు తగిలించాడు. అప్పటికే డేర దగ్గర వంట చేస్తూ వున్న సిపాయిలు రాగ అందరూ వెళ్ళి చచ్చిపడున్న సిపాయిలను తీసుకొచ్చి జీపులో వుంచి గుడ్డలను కప్పారు.

కమాండర్, అన్న వైపు చూస్తు ''జప్పరా జెప్పు తూ ఎంకులు ఆహే'' అన్నాడు తలను వెనక్కి విరుచుతు

అవునన్నట్లు తలాడించాడు

''తో జెప్పు మీ దళాలు కాహా ఆహే''

ఎంకులు మౌనంగాచూస్తువున్నాడు నోరు విప్పలేదు.

''జెప్పరా జెప్పు, నీకు ఛోడ్‌దేతే'' అన్నాడు

''చెప్పను''

''జంపేస్త''

''చెప్పను''

''నహీ బోలతా'' అంటూ ముఖం మీద తన్నాడు.

చెప్పలేదు. ముక్కుల్లోనుండి నోట్లోనుండి రక్త, కారుతువుంది. కడుపులో తన్నాడు.

నోరు విప్పాడు కాని మాట రాలేదు. రక్తం కక్కాడు. తన్నని చోటు లేదు. తిట్టని మాట లేదు. ''దూప, దూప'' అని సొమ్మసిల్ల తలను వాల్చాడు.

''పానీ న, గోలికా'' అంటూ నోట్లో తుపాకిని పెట్టి ట్రిగ్గర్ నొక్కాడు.

'ధాం' శబ్దం.

అలాగే తుపాకిని పట్టుకున్న ఎంకులు దానిని గుంజుకోజూశాడు.

మళ్ళీ 'ధాం' శబ్దం.

''జావో సాలా'' అంటూ బూటు కాలితో తన్నగానే కుప్పకూలి నేలకొరిగిన ఎంకులు పిడికిలిలో అక్కడి మట్టి.

నిద్రపోతున్న బిడ్డను తల్లి ఎదమీద ఎత్తుకున్నట్లు అక్కడినేల ఎంకులును తన మీద వాల్చుకుంది. అప్పటి వరకు రొండిన వున్న నిమ్మకాయను చేతిలోకి తీసుకున్నాడు.

ఆడి ఆడి అలసిపడుకున్న పాప చేతిలో రబ్బర్ బంతి వున్నట్టు, ఎంకులు పిడికిలిలో ఓ నిమ్మకాయ!

• 1997